క్లుప్తంగా

నవధాన్యాల కిట్లు పంపిణీ



అవగాహన కల్పిస్తున్న సేంద్రియ వ్యవసాయ సిబ్బంది

సారవకోట: నవ ధాన్యాలతో పంట పొలాలకు మేలు కలుగుతుందని సేంద్రియ వ్యవసాయ ఐబీఎం మోహనరావు సూచించారు. మండలంలోని తొగిరి పంచాయతీ కొమ్మువలసలో నవధాన్యాల కిట్లును రైతులకు ఆదివారం పంపిణీ చేశారు. వీటిని వినియోగించడం వల్ల భూమిలో తేమ శాతం కలిగి సూక్ష్మ పోషకాలు అభివృద్ధి చెంది మొక్కల పెరుగుదలకు ఉపయోగపడతాయన్నారు. వేసవి దుక్కుల్లో నవ ధాన్యాలను చల్లాలని సూచించారు. సిబ్బంది ప్రకాశ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

వెండి హారం బహూకరణ



అమ్మవారి విగ్రహానికి వెండి హారం వేస్తున్న దాతలు

పాతపట్నం: పాతపట్నంలోని నీలమణిదుర్గ అమ్మవారికి పాతపట్నంకు చెందిన యెరుకోల కృష్ణారావు, చంద్రకుమారి దంపతులు వెండి హారం, ఇత్తడి పూల అలంకరణ స్టాండ్‌ను ఆదివారం బహూకరించారు. ఈ వెండి హారం 526 గ్రాములు ఉంటుందని దాతలు తెలిపారు. ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ టి.వాసుదేవరావు, ఆలయ సిబ్బంది సుదర్శన రావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పొందూరు: మండల న్యాయసేవాధికర సంఘం ఆధ్వర్యంలో పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు అర్హులన్నారు. కనీస విద్యా అర్హత పదో తరగతి పాస్ అయి ఉండి, పొందూరు, జి.సిగడాం మండలాల పరిధిలో నివాసితులైనవారు దరఖాస్తు చేయాలన్నారు. అర్హత గల అభ్యర్థులు రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, విద్యా అర్హత ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తును ఈ నెల 22వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా మండల న్యాయసేవాధికార సంఘం కార్యాలయంలో అందజేయాలన్నారు. పారా లీగల్ వలంటీర్‌గా నియమితులైన వారికి ఎటువంటి పారితోషకం, వేతనం ఉండదన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత ఆర్‌కే లెవెన్



ఆర్‌కే లెవెన్ జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న నిర్వాహకులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో గత మూడు రోజులుగా నిర్వహించిన నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ టోర్నీ విజేతగా నరసన్నపేటకు చెందిన ఆర్‌కే లెవెన్ జట్టు నిలిచింది. 24 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో ఫైనల్‌కు నరసన్నపేటకు చెందిన ఆర్‌కే లెవెన్–గణేష్ లెవెన్ జట్లు చేరాయి. ఆదివారం సాయంత్రం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన గణేష్ లెవెన్ జట్టు 8 ఓవర్లకు 65 పరుగులు చేసింది. 66 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన ఆర్‌కే లెవెన్ జట్టు 7 ఓవర్లలో లక్ష్యం చేధించి విజేతగా నిలిచింది. కాకర్ల రవి జ్ఞాపకార్థం నిర్వహించిన ఈ టోర్నీ అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో జరిగింది. విజేతలకు ట్రోఫీని పీఈటీ గోపి తదితరులు అందించారు. ఫుట్‌బాల్ కోచ్ రాకేష్, నిర్వాహకులు జయవర్దన్, అనిల్, నక్క రాము తదతరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌తో ఉపాధి



సర్టిఫికెట్లను చూపిస్తున్న మహిళలు

ఆమదాలవలస: సత్యసాయి సేవా సంస్థలు, ఆమదాలవలస లక్ష్మీనగర్ సత్య సాయి అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకం కేంద్రం సంయుక్తంగా నిర్వహించిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో టైలరింగ్, మగ్గం నేతపై 40 మంది శిక్షణ ఇచ్చారు. వీరికి సత్య సాయి సేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షుడు రఘుపాత్రుని లక్ష్మణ రావు ఆదివారం సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కొత్త బ్యాచ్‌లో 25 మందికి మగ్గం వర్క్, 35 మందికి టైలరింగ్‌లో శిక్షణ ఇచ్చే కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిక్షణ పొందిన మహిళలందరూ స్వయం ఉపాధికి కృషిచేయాలని సూచించారు. జిల్లా అధ్యక్షుడు వై.లింగరాజు, జిల్లా సేవాదళ్ కోఆర్డినేటర్ ఎస్.రామచంద్రరావు, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన్ నరసింహమూర్తి, రాష్ట్ర విద్యాజ్యోతి ఇన్‌చార్జి శిరసాన సాయి గురుప్రసాద్, జిల్లా మెడికల్ ఇన్‌చార్జి డాక్టర్ పి.తాతయ్యలు, పారిశ్రామికవేత్త జె.జె.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేదన తీరింది



మెళియాపుట్టి: చందన గిరికి ఏర్పాటు చేసిన రహదారి

మెళియాపుట్టి: మండలంలోని ఎత్తైన కొండప్రాంతమైన చందనగిరి గిరిజన గ్రామానికి రహదారి సౌకర్యం లేక రేషన్ సరుకులు, విద్య, వైద్యం కోసం గిరిజనులు తీవ్ర అవస్థలు పడేవారు. కాలినడకనే కిందికి వచ్చి వారి అవసరాలను తీర్చుకునే పరిస్థితి ఉండేది. ఆ క్రమంలో పలుమార్లు పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి కొండెక్కి గిరిజనుల సమస్యలను తెలుసుకున్నారు. గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించడానికి కృషి చేస్తామని గిరిజనులకు మాటిచ్చారు. ఇచ్చినమాట ప్రకారమే ప్రభుత్వం సహకారంతో రహదారి మంజూరు చేయించారు. సుమారు రూ.కోటి అంచనా విలువతో మంజూరైన రహదారి పనులు ప్రస్తుతం శరవేగంగా సాగుతున్నాయి. అంతేకాకుండా ఆంపురం రహదారి సైతం రూ.2 కోట్లతో పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు మెళియాపుట్టి ఎంపీపీ ఈశ్వరమ్మ తెలిపారు.

బడ్డవానిపేట–ముప్పిడి రోడ్డు

నరసన్నపేట: నియోజకవర్గంలో నరసన్నపేట–పోలాకి మండలాలను కలుపుతూ రూ.5 కోట్లతో వంతెన మినహా మిగిలిన రహదారి పనులు పూర్తయ్యాయి. బడ్డవానిపేట వద్ద ఉన్న నూకాలమ్మ చానల్‌పై వంతెన నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ చొరవతో నరసన్నపేట మండలం బడ్డవానిపేట నుంచి తండ్యాలవానిపేట, దూకులపాడు, సత్యవరం,పైడితల్లి కూడలి, బోరిగివలస, ఈదులవలస, ముప్పిడి వరకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. 11 కిలో మీటర్లు పొడవైన ఈ రోడ్డు పీఎంజీఎస్‌వై నిధులతో అభివృద్ధి చేశారు. రోడ్డు పనులు పూర్తి కావడంతో ఈ ప్రాంతీయులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌ను స్థానికులు అభినందిస్తున్నారు.



నరసన్నపేట: పైడితల్లి కూడలి నుంచి బొరిగివలసకు వెళ్లే మార్గంలో నిర్మించిన రహదారి

ఆలయ నిర్మాణానికి సహకరించాలి



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచ్, కమిటీ ప్రతినిధులు

నరసన్నపేట: నరసన్నపేటలో గల పురాతన ఆలయాల్లో ఒకటైన బ్రమరాంబికా సహిత మల్లికార్జున స్వామి ఆలయ పునర్ నిర్మాణానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, ఆలయ పునర్ నిర్మాణ కమిటీ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆలయ విశిష్టతను తెలిపే బ్రోచెర్‌ను ఆదివారం సంతపేట వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి మాట్లాడుతూ జూన్ 11న ఆలయ పునర్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. పశ్చిమ ముఖం కలిగిన ఆలయంలో శివలింగాన్ని ఆదిశంకరాచార్యులు ప్రతిష్ఠించినట్లు చరిత్ర చెపుతుందన్నారు. ఎంతో విశిష్టత కలిగిన ఈ ఆలయం నిర్మించి వందల ఏళ్లు పూర్తయిందన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రచార కార్యదర్శిగా షణ్ముఖరావు



షణ్ముఖరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే కృష్ణదాస్, నాయకులు

పోలాకి: వైఎస్సార్‌సీపీ మండల ప్రచార కార్యదర్శిగా పార్టీ సీనియర్ నాయకుడు ధర్మాన షణ్ముఖరావును నియమిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ప్రకటించారు. మండలంలోని ప్రతిగ్రామంలోనూ కార్యకర్తలను కలిసి, క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతం జరిగేలా కృషిచేయాలని సూచించారు. షణ్ముఖరావు నియామకం పట్ల పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు కణితి కృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, మండల పరిషత్ సలహాదారుడు ముద్దాడ బైరాగినాయుడు తదితరులు అభినందించారు.

గణితంపై అవగాహన

ఎల్.ఎన్.పేట: మండలంలోని డొంకలబడవంజ గ్రామంలోని ప్రజా గ్రంథాలయం (బిడిసి)లో గణితంపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు గ్రంథాలయ నిర్వాహకులు ఠాగూర్ ఎడ్యుకేషనల్ అండ్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు పెద్దకోట వెంకటరావు చెప్పారు. 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు గణిత శాస్త్రంలో మెలకువలు, గణిత సమస్యలను నివృత్తి చేసినట్లు గణిత ఉపాధ్యాయులు దంతకుర్తి సంతోష్‌కుమార్ ఆదివారం తెలిపారు. జూన్ 11వ తేదీ వరకు ఇంగ్లిషు, గణితం, హిందీ, మ్యాప్ పాయింటింగ్ అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు తొగిరిలో గడపగడపకు మన ప్రభుత్వం

సారవకోట: మండలంలోని కిన్నెరవాడ సచివాలయం పరిధిలోని తొగిరి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ సోమవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ విశ్వేశ్వరరావు ఆదివారరం తెలిపారు. మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరుకావాలని కోరారు.

ఈదురుగాలుల బీభత్సం



నరసన్నపేట: నరసన్నపేటలో వీస్తున్న ఈదురుగాలులు

ఎల్.ఎన్.పేట: మండలంలో ఆదివారం సాయంత్రం బలమైన ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ కాచినప్పటికీ సాయంత్రానికి వాతావరణం మారిపోయింది. గాలుల కారణంగా మామిడి పంటకు నష్టం వాటిల్లిందని మిరియాపల్లి, బసవరాజుపేట, వాడవలస, లక్ష్మీనర్సుపేట, దబ్బపాడు, బొత్తాడసింగి, జంబాడ తదితర గ్రామాలకు చెందిన మామిడి రైతులు తెలిపారు.

చిరు జల్లులు..

నరసన్నపేట: మండలంలో ఆదివారం భానుడు ప్రతాపం చూపించాడు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు తీవ్ర అలసటకు గురయ్యారు. సాయంత్రానికి వాతావరణం పూర్తిగా మారిపోయింది. ఈదురుగాలులు వీచి చిన్న పాటి వర్షం పడటంతో ఒక్కసారిగా చల్ల బడింది. ఈదురుగాలులకు పట్టణంలో ఉన్న ఫ్లెక్సీలన్నీ నేలకొరిగాయి. పరిసర గ్రామాల్లో మామిడి పంటకు నష్టం వాటిల్లింది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కొబ్బరి చెట్టుపై పిడుగు..

హిరమండలం: మండలంలోని దుర్బలాపురంలో ఆదివారం సాయంత్రం కొబ్బరి చెట్టుపై పిడుగుపడి మంటలు వచ్చాయని గ్రామస్తులు తెలిపారు. సాయంత్రం ఉరుములు, మెరుపులతో చిరుజల్లులు పడ్డాయి. ఈదురు గాలులువీచాయి. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదని గ్రామస్తులు తెలిపారు.

అంధకారంలో కొండపేట..

బూర్జ: మండలంలో గల పెద్దపేట సచివాలయ పరిధి కొండపేట గ్రామంలో విద్యుత్ సరఫరాలేక అంధకారంలో ఉంది. మండలంలో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులు వర్షం కురవడంతో టీడీఆర్ (ట్రాన్స్‌ఫార్మర్) కాలిపోయింది. గ్రామంలో విద్యుత్ లేక ప్రజలు చీకటిలో అవస్థలు పాడుతున్నారు. ఇదివరకే గ్రామంలో లో ఓల్టేజీ సమస్య ఉండేదన్నారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఉంటే ఒకటి వేరేచోటకి మార్చడంతో ఈ సమస్య వచ్చిందన్నారు.



ఎల్.ఎన్.పేట: గాలులు వీస్తున్న దృశ్యం



హిరమండలం: కొబ్బరి చెట్టుపై పిడుగుపడి మంటలు వస్తున్న దృశ్యం

కుక్కల దాడిలో బాలుడికి గాయాలు



గాయాలను చూపిస్తున్న బాలుడు

ఎల్.ఎన్.పేట: మండలంలోని ఎఫ్.డి.పేట గ్రామానికి చెందిన పొట్నూరు చరణ్ అనే బాలుడు గ్రామ శివారులో ఒంటరిగా ఆడుకుంటున్నాడు. వీధిలోకి వచ్చిన కుక్కల గుంపు ఒక్కసారిగా బాలుడుపై దాడికి తెగబడ్డాయి. బాలుడు వీధిలోకి పరిగెత్తడంతో వెంబడించాయి. వీధిలో ఉన్న మరో యువకుడు గమనించి కుక్కలను తరిమాడు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. తెలంగాణ, ఆంధ్రాల్లో ఇంటీవల కుక్కలు దాడి చేస్తున్న సంఘటనలు గుర్తు చేసుకున్న కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



ఆదినారాయణ (ఫైల్)

జలుమూరు: కొమనాపల్లి పంచాయతీ కత్తిరివానిపేటకు చెందిన గానుగుల ఆదినారాయణ (54) ఆదివారం మృతి చెందారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదినారాయణ వృత్తిరీత్యా కర్ర పని చేసి జీవనం సాగిస్తుండేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస అయి పని వెళ్లకుండా తిరుగుతూ ఉండేవాడు. భార్య సరస్వతి, కుమారుడు శంకరరావు ప్రశ్నించారు. ఈ నెల 10న ఆంజనేయ స్వామి ఆలయం పక్కన పురుగుల మందును కూల్ డ్రింక్‌లో కలిపి తాగుతుండగా అదే గ్రామానికి చెందిన వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అప్పటికే అపస్మారక స్థితికి చేరుకున్నాడు. శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించి ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

కుమారుడు శంకరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ పారినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

22న రిలే నిరాహారదీక్ష

పొందూరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం(ఏపీజీఈఏ) రాష్ట్ర నాయకత్వం పిలుపుమేరకు పొందూరు తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ నెల 22న రిలే నిరాహార దీక్ష చేపట్టనున్నారు. ఈ మేరకు ఏపీజీఈఏ పొందూరు తాలూకా యూనిట్ అధ్యక్షుడు పి.మోహనరావు ఆదివారం తెలిపారు. సీపీఎస్ రద్దు, ప్రతీనెల 1వ తేదీన జీతభత్యాలు చెల్లింపు, డీఎస్సీ ద్వారా నియమితులైన కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయడంతో పాటు ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను వెంటనే విడుదల చేయడం వంటి పలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఈ రిలేదీక్షను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

దరఖాస్తు చేసుకోవాలి

పొందూరు: వావిలిపల్లిపేట ఆదర్శ పాఠశాలలో 2023–24 విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో చేరేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ హెచ్.ప్రభాకరరావు ఆదివారం తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ చేరేందుకు అవకావశం ఉందన్నారు. ఓబీసీ, ఓసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు రుసుం రూ.200 చెల్లించాలని, ఎస్సీ, ఎస్టీలకు ఫీజు మినహాయింపుతో రూ.150 చెల్లించాలన్నారు.

అద్దాల మండపం ప్రతిష్ఠ



అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండల కేంద్రంలోని నీలమణిదుర్గ ఆలయం ఆవరణలో ఏర్పాటు చేసిన అద్దాల మండపాన్ని, అమ్మవారి విగ్రహాన్ని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఆదివారం ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే భర్త రెడ్డి నాగభూషణరావు జ్ఞాపకార్థం అమ్మవారి ఆలయంలో రూ.8 లక్షలతో అద్దాల మండపాన్ని నిర్మించి ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతపట్నం అమ్మవారి ఆలయంలో ప్రశాంతత కలుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, ఈఓ వాసుదేవరావు సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరావు, ఏఎంసీ చైర్మన్ కె.అర్జునుడు, వైస్ ఎంపీపీ ఎస్.ప్రదీప్, మండల సచివాలయ అధ్యక్షుడు వై.సూర్యం, సుధ, కృష్ణారావు, నేతాజీ, ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలు విజయవంతం చేయాలి



పాతపట్నం ప్రధాన రహదారిపై కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

- పాతపట్నం సీఐ వినోద్‌బాబు

పాతపట్నం: పాతపట్నంలోని నీలమణిదుర్గ ఉత్సవాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత పోలీసు శాఖపై ఉందని పాతపట్నం సీఐ ఎం.వినోద్ బాబు అన్నారు. ఆదివారం సాయంత్రం పాతపట్నం ప్రధాన వీధిలో సీఐ ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ప్రధాన రహదారిపై పోలీసులతో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఆదివారం నుంచి ఉత్సవాలు ప్రారంభమయ్యాయని, సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అమ్మవారి ఆలయం వరకు ఒక్కో వీధిలో ఇద్దరు పోలీసులు చొప్పున నియమించామన్నారు. 450 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్ఐ కామేశ్వరరావు, ఏఎస్ఐలు సింహాచలం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధ్యాపకుల నియామకం

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రానున్న విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ తరగతుల నిర్వహణకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. దీంట్లో భాగంగా నాలుగు సబ్జెక్టులకు అధ్యాపకులను నియమించింది. గత ఏడాదే తరగతుల నిర్వహణకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంట్లో భాగంగా ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతుల నిర్వహణకు ఇంటర్ బోర్డు సిద్ధం అవుతోంది. కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఇంగ్లిష్, జూయాలజీ అధ్యాపకులను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉర్లాం సర్పంచ్ పోలాకి నర్సింహమూర్తి, ఎంపీటీసీ నడిమింటి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు సురంగి నర్సింగరావు, సతివాడ రామినాయుడు, పోలాకి రమణయ్య తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

కుప్పిలికి రాష్ట్ర స్థాయి పురస్కారం

ఆమదాలవలస: నర్సుల దినోత్సవం సందర్భంగా గుంటూరుకు చెందిన అమరావతి సాహితీ మిత్రులు సంస్థ నిర్వాహకులు ఏర్పాటు చేసిన కవితల పోటీల్లో ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావుకు పురస్కారం లభించింది. 66 కవితలు పోటీల్లో పాల్గొనగా రాజారావు రచించిన 'సేవా కపోతం' ఉత్తమ కవితగా ఎంపికైంది.

గుంటూరులోని సోషల్ హెల్త్ ఆర్గనైజేషన్ హాల్‌లో ప్రముఖ వైద్యుడు సేవా కుమార్, అధ్యక్షుడు రావి రంగారావు చేతుల మీదుగా ఆదివారం బహుమతి అందుకున్నట్లు రాజారావు తెలిపారు.

డకరవలసలో పారిశుద్ధ్య పనులు

సరుబుజ్జిలి: డకరవలస గ్రామంలో ఆదివారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. గ్రామంలోని మురుగు కాలువల్లో ఉన్న చెత్తను తొలగించి చెత్త సంపద కేంద్రానికి తరలించారు. బోర్లు, నేలబావుల వద్ద ఈగలు, దోమలు చేరకుండా క్లోరినేషన్ చేపట్టారు. సర్పంచ్ సురవరపు తిరుపతిరావు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దృశ్యం

బాబోయ్ కుక్కలు



సరుబుజ్జిలిలో సంచరిస్తున్న కుక్కలు

సరుబుజ్జిలి: గ్రామాల్లో విస్తారంగా కుక్కలు సంచరించడం వల్ల వీధుల్లోకి వచ్చేందుకు ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలు, మహిళలతోపాటు పశువులు కూడా కుక్కలు బారిన పడుతున్నాయి.

ఇటీవల కాలంలో సరుబుజ్జిలి, తురకపేట, వ్యాసులపేట, పెదమాలపేట గ్రామాల్లో పలువురు వ్యక్తులకు, పశువులకు కుక్కలు గాయపరిచాయి. కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.